## లష్కర్ వారం.. పులకించిన భక్తజనం



సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో ఆదివారం లష్కర్‌వారం సందర్భంగా 50 వేల మంది భక్తులు స్వామి వారి దర్శనానికి వచ్చారు. సికింద్రాబాద్, కరీంనగర్, వరంగల్ నుంచి భక్తులు పోటెత్తారు. పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్నను దర్శించుకున్నారు. పట్నాలు వేసి ముడుపులు చెల్లించగా, మరికొందరు బోనాలు సమర్పించారు. ఆలయ ఈవో ఏ బాలాజీ, ఆలయ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. – చేర్యాల

## యాదగిరిగుట్టలో భక్తుల సందడి



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆలయం ఆదివారం భక్త జనసంద్రమైంది. మాడ వీధులు, ప్రసాద విక్రయశాలలు, లడ్డూ ప్రసాదం కౌంటర్లు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు రద్దీగా మారాయి. ధర్మ దర్శనానికి దాదాపు 4 గంటలు, ప్రత్యేక దర్శనానికి 2 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 42వేల మంది భక్తులు దర్శించుకోగా, ఖజానాకు రూ.57,47,013 ఆదాయం సమకూరినట్టు ఈవో రామకృష్ణారావు తెలిపారు. – యాదగిరిగుట్ట

## లోకం పోకడ




## 22 మంది ఎమ్మెల్యేలపై ఎలక్షన్ పిటిషన్లు

- హైకోర్టులో 30 పిటిషన్లు వేసిన ప్రత్యర్థులు

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 22 మంది ఎమ్మెల్యేలపై హైకోర్టులో 30 ఎలక్షన్ పిటిషన్లు దాఖలయ్యాయి. వారు సమర్పించిన అఫిడవిట్లలో తప్పులు ఉన్నాయంటూ ప్రత్యర్థులు ఈ పిటిషన్లు వేశారు. హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఎన్నికను సవాలు చేస్తూ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, జూబ్లీహిల్స్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు వ్యతిరేకంగా అజారుద్దీన్, కూకట్‌పల్లిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎన్నికను సవాలు చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేశ్ పిటిషన్లు వేశారు. గద్వాల, ఆసిఫాబాద్, పటాన్‌చెరు, కొత్తగూడెం, సిరిసిల్ల, సిద్దిపేట తదితర నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా కూడా పిటిషన్లు దాఖలయ్యాయి. ఈవీఎంలకు సంబంధించిన ఎలక్షన్ పిటిషన్(ఈపీ)లను ఎన్నికలు ముగిశాక 45 రోజుల్లోగా దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 18 వరకు పిటిషన్లను సేకరించారు. ఈవీఎంలతో సంబంధంలేని కేసులున్న నియోజకవర్గాల ఈవీఎంలను పార్లమెంట్ ఎన్నికల్లో వినియోగిస్తారు. పార్లమెంట్ ఎన్నికలకు అదనపు ఈవీఎంలు కావాలంటూ సీఈవో వికాస్‌రాజ్ ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు.

# ధాన్యం టెండర్లలో 'అతి'వేగం

**సాయంత్రం కమిటీ ఏర్పాటు.. అర్ధరాత్రి నోటిఫికేషన్**

- ఐదు గంటల వ్యవధిలోనే అంతా పూర్తి
- జెట్ స్పీడ్‌పై వ్యక్తమవుతున్న అనుమానాలు
- అంతా రెడీచేసి ఆపై కమిటీ ఉత్తర్వులు

యాసంగి ధాన్యం విక్రయానికి నిబంధనలు రూపొందించేందుకు..

25వ తేదీ సాయంత్రం 6.47 గంటలకు రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ

రాత్రి 11.52 గంటలకు ధాన్యం విక్రయానికి నోటిఫికేషన్ జారీచేసిన పౌరసరఫరాల సంస్థ

రాత్రి 11.55 నుంచి వేలానికి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

హైదరాబాద్, జనవరి 28(నమస్తే తెలంగాణ): కేవలం ఐదు గంటల వ్యవధిలో మొత్తం తతంగం పూర్తయింది. ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేయడం, ఆ కమిటీ సభ్యులకు సమాచారం అందడం, ఆ కమిటీ భేటీ కావడం, నిబంధనలపై చర్చించడం, నివేదిక రూపొందించడం, రూపొందించిన నివేదికను ప్రభుత్వానికి అందించడం, ప్రభుత్వం దానిని ఆమోదించడం, ఆ వెంటనే నోటిఫికేషన్ జారీచేయడం, వేలానికి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించడం.. ముఖ్యమైన విషయాలన్నీ ఇలా ఐదు గంటల వ్యవధిలోనే ఆగమేఘాల మీద పూర్తికావడం ఆశ్చర్యపరుస్తున్నది. సాయంత్రం కమిటీ వేస్తే



అర్ధరాత్రి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కావడంపై నిపుణులు ముక్కున వేలేసుకుంటున్నారు.

**'అతి'వేగం ఎవరి కోసం?**

2022–23 యాసంగి సీజన్‌కు సంబంధించి 35 లక్షల టన్నుల ధాన్యం విక్రయానికి పౌరసరఫరాల సంస్థ గ్లోబల్ టెండర్లు పిలవాలని నిర్ణయించింది. విధివిధానాలు, నిబంధనలు రూపొందించేందుకు ఈ నెల 25న సీఎస్ శాంతికుమారి రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. విచిత్రంగా అదేరోజు అర్ధరాత్రికి ధాన్యం వేలానికి సంబంధించి పౌరసరఫరాల సంస్థ నోటిఫికేషన్ జారీచేయడంతో పాటు దరఖాస్తుల స్వీకరణ కూడా ప్రారంభించింది. ఈ హైస్పీడ్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది అంత అర్జెంటుగా చేయాల్సిన పనికాకుండా ఆగమేఘాల మీద అన్ని పనులు పూర్తి కావడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అతి వేగపై పౌరసరఫరాలశాఖ అధికారి ఒకరు స్పందిస్తూ తమ సంస్థ ఇప్పుడు జెట్ స్పీడ్‌తో పనిచేస్తున్నదని సెటైర్ వేశారు.

**ముందే పూర్తయిన తంతు!**

అధికారంలోకి వచ్చీరాగానే యాసంగి ధాన్యం విక్రయంపై కాంగ్రెస్ నిర్ణయం తీసుకున్నది. డిసెంబర్ 27న పౌరసరఫరాలశాఖ కమిషనర్‌గా నియమితులైన ఐపీఎస్ అధికారి డీఎస్ చౌహాన్ ధాన్యం విక్రయంపై కసరత్తు మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే పదిహేను రోజులుగా అధిక సమయాన్ని కేటాయించి మరీ నిబంధనలు రూపొందించారు. కమిటీ ఏర్పాటు, అందులో ఎవరు ఉండాలి? అన్నదానిపై ప్రభుత్వం ముందే స్పష్టత ఇచ్చినట్టు తెలిసింది. దీంతో మొత్తం కార్యాన్ని ముందే పూర్తిచేయడంతో ప్రభుత్వం నుంచి కమిటీ ఏర్పాటుకు ఉత్వర్వులు వచ్చిన తర్వాత 'మమ' అనిపించారు.

**అప్పుడు విమర్శించి.. ఇప్పుడు అదే చేసి**

2022–23 యాసంగి సీజన్‌లో పౌరసరఫరాల సంస్థ రైతుల నుంచి 66.84 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. 25 లక్షల టన్నుల ధాన్యం విక్రయానికి ఇప్పట్లానే అప్పట్లోనూ గ్లోబల్ టెండర్లు పిలిచింది. దీనిపై ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టాయి. ధాన్యం వేలాన్ని నిలిపివేయాలన్న కాంగ్రెస్ లేఖతో ఎన్నికల సంఘం ఆ వేలాన్ని ఆపేసింది. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్, గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేసినట్టుగా ధాన్యం విక్రయించాలని నిర్ణయించింది. అప్పుడు 25 లక్షలు టన్నులు విక్రయించాలని కేసీఆర్ ప్రభుత్వం భావిస్తే ఇప్పుడు మరో పది పెంచి 35 లక్షల టన్నుల ధాన్యం విక్రయానికి టెండర్లు పిలవడంపై సర్వత్ర విస్మయం వ్యక్తమవుతున్నది.

## బిల్డర్లు సంపద సృష్టికర్తలు

- వారిని అన్నివిధాలా ప్రోత్సహిస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం బిల్డర్లను కాంట్రాక్టర్లుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా చూస్తున్నదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. వారిని తప్పకుండా ప్రోత్సహిస్తామని భరోసా ఇచ్చారు. హైటెక్స్‌లో జరుగుతున్న బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 31వ కన్వెన్షన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. దేశీయ నిర్మాణ రంగంలో తెలుగు రాష్ట్రాల కాంట్రాక్టర్ల భాగస్వామ్యం ఎక్కువగా ఉన్నదని, దేశ సంపదను సృష్టించడంలో తెలుగు రాష్ట్రాల బిల్డర్లు కీలక భూమిక పోషిస్తున్నారని ప్రశంసించారు. సంక్షేమ రాజ్యం కావాలంటే సంపద కావాలని, సంపదను సృష్టించే సంస్థలు ఉన్నప్పుడే ప్రజల సంక్షేమ అవసరాలను ప్రభుత్వాలు తీర్చగలవని చెప్పారు. సంపదను సృష్టించే సంస్థలకు ఇందిరమ్మ రాజ్యంలో ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని, తెలంగాణలో సంపద సృష్టించేవారికి అన్నివిధాలుగా సహకరిస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. అంతకుముందు ఆయన కన్వెన్షన్ వద్ద ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం 'బిల్డింగ్ త్రూ టైం', 'టెక్నికల్ వాల్యూమ్' పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు ఎస్‌ఎన్ రెడ్డి, చైర్మన్ బీ శ్రీనయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ సచితానందరెడ్డి, రాష్ట్ర చైర్మన్ దేవేందర్‌రెడ్డి, కో–వైస్‌చైర్మన్ డీవీఎన్ రెడ్డి, నేషనల్ కన్వెన్షన్ చైర్మన్ ఆర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీల ఎన్నికలు నిర్వహించాలి

- సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

హైదరాబాద్, జనవరి 28(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గ్రామపంచాయతీల కాలపరిమితి 2024 జనవరి 31న ముగియనున్నందున తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలక వర్గాలను రద్దు చేసి స్పెషల్ ఆఫీసర్ల నియామకంపై కలెక్టర్లకు ఆదేశాలిచ్చినట్టు తెలుస్తున్నదని, దీన్ని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్రకమిటీ వ్యతిరేకిస్తున్నదని తెలిపారు. 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం గ్రామ పంచాయతీలకు విధిగా ఐదేండ్లకొకసారి ఎన్నికలు జరిపి, ప్రజల చేత ఎన్నికైన పాలకవర్గాలను కొనసాగించాలని కోరారు.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 8.7°c | 32.7°c |
| రంగారెడ్డి | 12.5°c | 32.8°c |
| మెదక్ | 12.7°c | 32.0°c |
| నిజామాబాద్ | 16.5°c | 31.1°c |
| హైదరాబాద్ | 17.0°c | 29.8°c |
| కరీంనగర్ | 17.0°c | 30.0°c |
| వరంగల్ | 18.0°c | 30.0°c |
| నల్లగొండ | 18.0°c | 32.6°c |
| ఖమ్మం | 21.0°c | 34.0°c |
| మహబూబ్‌నగర్ | 21.2°c | 31.3°c |

# జన గణనలో కులగణన చేపట్టాలి

- కేంద్రానికి ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్

హైదరాబాద్, జనవరి28 (నమస్తే తెలంగాణ): కేంద్రంలోని మోదీ సర్కార్ జనగణనలో కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కులగణనకు ప్రభుత్వం నిర్ణయించిందని, దీనిని తాము స్వాగతిస్తున్నట్టు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ బీసీ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ..జనగణనలో కులగణన చేపట్టేందుకు వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో అన్ని పార్టీలు కలిసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడాన్ని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం దిగిరాకపోతే పార్లమెంటు సమావేశాలు బహిష్కరించాలని కోరారు. కులగణనతో బీసీలకు విస్తృతమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ తెలిపారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ లాల్ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు రాజేందర్, తెలంగాణ ఐక్య వేదిక అధ్యక్షుడు అనంతయ్య, నేతలు గుజ్జ కృష్ణయాదవ్, అంజి, శివకుమార్, రాందేవ్‌మోదీ, రామాంజనేయులు, శివ గోపి, పర్వతాలు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎంను కలిశా

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్, జనవరి 28: నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాశ్‌గౌడ్ స్పష్టం చేశారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని రేవంత్‌రెడ్డి నివాసంలో సీఎంను ఎమ్మెల్యే కలువగా, ప్రకాశ్‌గౌడ్ పార్టీ మారుతున్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీనిపై స్పందించిన ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను సీఎంను కలిశానని స్పష్టం చేశారు. శంషాబాద్ మండలంలోని కొత్వాల్‌గూడ, బహదూర్‌గూడ, ఘాన్సిమియాగూడ గ్రామాల్లోని భూ సమస్యలను పరిష్కారం చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరినట్టు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

వివరించారు. దీనిపై సీఎం సానుకులంగా స్పందించిన్నట్టు తెలిపారు.

# కులగణనపై గందరగోళం

> మొదటిపేజీ తరువాయి...

అనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్రానికి జనాభా గణన నిర్వహించే అధికారం లేనందున ఆ సర్వే వివరాలను నాటి ప్రభుత్వం వెల్లడించలేదు. అమలు కూడా చేయలేదు. మరిప్పుడు కాంగ్రెస్ సర్కారు ఏ రీతిన కులగణన చేపడుతుందనేది చర్చనీయాంశంగా మారింది.

**సుప్రీంకోర్టు మార్గదర్శకాలు**

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా కల్పిస్తున్నారు. బీసీలకు మాత్రం నామమాత్రంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లను కల్పిస్తూ వస్తున్నాయి. గతంలో లాటరీ పద్ధతిలో, ర్యాండమ్‌గా ఎంపిక చేసే తదితర అశాస్త్రీయమైన పద్ధతుల్లో బీసీలకు రిజర్వేషన్లను కల్పించారు. దీంతో ప్రతిసారీ బీసీ రిజర్వేషన్లపై న్యాయవివాదాలు తలెత్తడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో ఓబీసీ రిజర్వేషన్లపై కర్ణాటకకు చెందిన కేఈ కృష్ణమూర్తి, మహారాష్ట్రకు చెందిన వికాస్‌రావు గవాళి కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది. ట్రిపుల్ టీ పేరిట పలు మార్గదర్శకాలు జారీచేసింది. అందులో మొదటిది ప్రతి స్థానిక సంస్థలో ఓబీసీ రిజర్వేషన్ల అమలు, ఫలితాలపై అధ్యయనం చేసేందుకు పూర్తిస్థాయి రాజ్యాంగబద్ధమైన, డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. రెండవది జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లను స్థిరీకరించాలి. మూడవది రిజర్వేషన్లు కూడా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కలిపి మొత్తంగా 50 శాతం మేరకు మించకూడదు. వాటినే ట్రిపుల్ టీ అంటారు. ఆ మార్గదర్శకాలు పాటించని ఏ రాష్ట్రంలోనూ లోకల్‌బాడీ ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయకూడదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఆ నిబంధనలను పాటించని పలు రాష్ట్రాల్లో స్థానిక సంస్థల ఎన్నికలను కూడా అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసింది. సిఫారసులు లేకుంటే బీసీ రిజర్వేషన్ స్థానాలన్నింటినీ జనరల్ స్థానాలుగానే మార్చే అవకాశముంది. సూటిగా చెప్పాలంటే కమిషన్ల నివేదిక లేకుండా స్థానికసంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్లు ఇకపై ఉండబోవనేది ఈ తీర్పు సారాంశం.

**ఇప్పటికే తుదిదశకు నివేదిక..**

సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి తెలంగాణ ప్రభుత్వం గతంలోనే డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలో పూర్తిస్థాయి డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల నిర్ణయానికి సంబంధించి ఎంచుకోవాల్సిన విధానం, న్యాయపరమైన అంశాలను అధ్యయనం చేసేందుకు కమిషన్‌కు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌ను కూడా నిర్దేశించింది. ఆ దిశగా కమిషన్ అధ్యయనం చేపట్టింది. తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటించింది. గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన తీర్పులను పరిశీలించింది. ఆయా రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్లు, బీసీల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు, జనగణనలో ఎదురైన సవాళ్లు, పరిష్కార మార్గాలు తదితర అంశాలపై అక్కడి బీసీ కమిషన్లతో సమాలోచనలు జరిపింది. అనంతరం రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖాధిపతులతో ప్రత్యేకంగా సమావేశాలను నిర్వహించి విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో (స్థానిక సంస్థలు) బీసీల ప్రాతినిధ్యం, పొందిన అవకాశాలకు సంబంధించి గణాంకాలను అందజేయాలని అన్ని ప్రభుత్వ శాఖలను ఆదేశించింది. ఇప్పటికే అందుకు సంబంధించి నిర్దిష్టంగా సమాచారాన్ని సేకరించింది. తుదినివేదికను సిద్ధం చేస్తున్నది.

**కమిషన్‌తోనా? ప్రణాళికశాఖ ద్వారానా?**

బీహార్ తరహాలో రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో కుల గణన నిర్వహిస్తారా? లేదంటే కర్ణాటక, గుజరాత్ తదితర రాష్ట్రాల తరహాలో నిర్వహిస్తారా? అనే అంశంపై బీసీ నేతల్లో చర్చ మొదలైంది. ప్రణాళిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తే బీహార్ తరహాలోనే న్యాయ చిక్కులు తప్పకపోవచ్చని తెలుస్తున్నది. అలా కాకుండా బీసీ కమిషన్ నేతృత్వంలోనే చేపట్టాలంటే తాజాగా ప్రభుత్వం మరోసారి స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేయాల్సి ఉన్నది. కమిషన్ కాలపరిమితి ఆగస్టు వరకు మాత్రమే ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆ పనిచేస్తుందా? లేదా? అనేది ఆసక్తిగా మారింది. బీసీ కమిషన్ రాజ్యాంగబద్ధ సంస్థ కాబట్టి దానిని రద్దు చేసే అవకాశం ప్రభుత్వానికి లేదు. దీంతో గత ప్రభుత్వం నియమించిన ప్రస్తుత చైర్మన్, సభ్యులతో స్వచ్ఛందంగా రాజీనామా చేయించాలని చూస్తున్నట్టు సమాచారం. అందుకు వారు అంగీకరిస్తారా? అనేది మరో ప్రశ్న. కొత్త కమిషన్‌ను ఏర్పాటు చేసినా రాబోయే కొద్ది రోజుల్లోనే లోకసభ ఎన్నికల రానున్నాయి. దీంతో అన్ని ప్రభుత్వశాఖలు ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమై ఉంటాయి. దీంతో కుల సర్వే నిర్వహించడం అసాధ్యమనే చెప్పాలి. వెరసి లోక్‌సభ ఎన్నికల తరువాతే కుల సర్వే నిర్వహించాల్సి ఉంటుంది. అదే జరిగితే సర్వే నిర్వహించి, గణాంకాలు వెలికితీసి, నివేదికను రూపొందించి, ప్రభుత్వానికి సమర్పించి ఆమోదం పొందడానికి మరింత జాప్యమవుతుంది. అప్పటివరకు రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశమే ఉండబోదు. ఒకవేళ నిర్వహిస్తే ఎస్సీ, ఎస్టీలకు తప్ప ఎవరికీ రిజర్వేషన్లు అనేవే ఉండవు.

## నిపుణ – విద్య, ఉద్యోగ సమాచారం

**డీఆర్‌డీవోలో..**

డీఆర్‌డీవో పరిధిలోని డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై ఆల్టిట్యూడ్ రీసెర్చ్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 14
- పోస్టులు: జేఆర్‌ఎఫ్, రీసెర్చ్ అసోసియేట్
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఇంటర్వ్యూ తేదీ: ఫిబ్రవరి 15
- వెబ్‌సైట్: https://drdo.gov.in

**ఎన్‌పీసీఐఎల్‌లో..**

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 53
- పోస్టులు: స్టయిఫండరీ ట్రెయినీ/ సైంటిఫిక్ అసిస్టెంట్
- విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, ఫిజిక్స్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: ఫిబ్రవరి 14
- వెబ్‌సైట్: https://www.npcilcareers.co.in

**హెచ్‌సీఎల్‌లో..**

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 40
- పోస్టులు: గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెయినీ
- అర్హతలు: కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణత. గేట్ స్కోర్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: ఫిబ్రవరి 19
- వెబ్‌సైట్: https://www.hindustancopper. com

**ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్**

పోటీ పరీక్షల ప్రత్యేకం

- జువాలజీ, కరెంట్ అఫైర్స్, ఇంగ్లిష్ గ్రామర్ (గ్రూప్స్) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

# పెద్ద ఫ్లాట్లకు గిరాకీ

- క్రమంగా పెరుగుతున్న సగటు వైశాల్యం
- ఐదేండ్లలో 250 చదరపు అడుగులు వృద్ధి
- ప్రస్తుతం 1,300 చదరపు అడుగులకు
- హైదరాబాద్‌లో అత్యధికంగా 2,300 చదరపు అడుగులు
- రియల్ ఎస్టేట్ మార్కెట్ అధ్యయన సంస్థ 'అనరాక్' వెల్లడి

**ఫ్లాట్ల కనీస సగటు విస్తీర్ణం (చదరపు అడుగుల్లో)**

| సంవత్సరం | చదరపు అడుగు |
|---|---|
| 2019 | 1,050 |
| 2020 | 1,167 |
| 2021 | 1,170 |
| 2022 | 1,175 |
| 2023 | 1,300 |

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 28 (నమస్తే తెలంగాణ): దేశంలో అపార్ట్‌మెంట్ సంస్కృతి నానాటికీ విస్తరిస్తున్నది. దీంతో ఫ్లాట్ల కనీస సగటు వైశాల్యం క్రమంగా పెరుగుతున్నది. గత ఐదేండ్లలో ఈ సగటు 24% పెరిగినట్టు రియల్ ఎస్టేట్ మార్కెట్ అధ్యయన సంస్థ 'అనరాక్' తేల్చింది. 2019 సంవత్సరంలో 1,050 చదరపు అడుగులుగా ఉన్న ఫ్లాట్ల కనీస సగటు వైశాల్యం ప్రస్తుతం 1,300 చదరపు అడుగులకు చేరినట్టు ఆదివారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ప్రజల అభిరుచులు, జీవనశైలిలో గణనీయ మార్పులు రావడం వల్ల చిన్న ఇండ్లతో సరిపెట్టుకోకుండా విశాలమైన లగ్జరీ ఫ్లాట్ల వైపు మొగ్గు చూపుతున్నట్టు 'అనరాక్' గ్రూప్ చైర్మన్ అనుజ్ పూరి స్పష్టం చేశారు. దీంతో విలాసవంతమైన ఫ్లాట్లకు డిమాండ్ క్రమంగా పెరుగుతున్నదని, 2023లో ప్రారంభమైన కొత్త ప్రాజెక్టుల్లో లక్షకుపైగా యూనిట్లు (దాదాపు 23 శాతం) లగ్జరీ క్యాటగిరీలో ఉన్నాయని తెలిపారు.

**హైదరాబాద్‌లో అత్యధిక సగటు**

కొవిడ్ సంక్షోభానంతరం ఇండ్ల ధరలు నానాటికీ పెరుగుతున్నప్పటికీ పెద్ద సైజు ఫ్లాట్లకు డిమాండ్ తగ్గడం లేదని 'అనరాక్' వెల్లడించింది. ప్రస్తుతం ఫ్లాట్ల కనీస సగటు వైశాల్యం హైదరాబాద్‌లో అత్యధికంగా 2,300 చదరపు అడుగులుగా ఉన్నట్టు తెలిపింది. ఆ తర్వాతి స్థానాల్లో నేషనల్ క్యాపిటల్ రీజియన్–ఎన్సీఆర్ (1,890 చదరపు అడుగులు), బెంగళూరు (1,484 చదరపు అడుగులు), చెన్నై (1,260 చదరపు అడుగులు), పుణె (1,086 చదరపు అడుగులు) ఉన్నట్టు వివరించింది.

## ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధిగా మల్లు రవి బాధ్యతలు

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా డాక్టర్ మల్లు రవి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, జే అనిరుధ్ రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీగౌడ్ తదితరులు హాజరై మల్లు రవికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ.. తనను ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధిగా నియమించిన సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామానికో రెవెన్యూ ఉద్యోగి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి
- డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, టీజీటీఏ డైరీ ఆవిష్కరణ

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను గ్రామీణ స్థాయి నుంచి పటిష్టం చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో ఒక రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చూస్తామని పేర్కొన్నారు. ఆదివారం డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ తాసిల్దార్స్ అసోసియేషన్ (టీజీటీఏ) నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య రెవెన్యూ ఉద్యోగులు వారధులుగా పనిచేస్తున్నారని చెప్పారు. గతంలో ప్రతి గ్రామంలో వీఆర్వో లేదా వీఏవో ఉండేవారని గుర్తు చేశారు. సంస్కరణల పేరుతో వారి ఉనికి లేకుండా చేశారని విమర్శించారు. ప్రతి గ్రామంలో ఒక ప్రతినిధిని నియమిస్తామని చెప్పారు. తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ఉద్యోగులకు 5వ తేదీలోపే వేతనాలు పడేలా చూస్తామని తెలిపారు. ధరణి లోపాలను సరిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, సెక్రటరీ జనరల్ రమేశ్‌రాథోడ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, పద్మప్రియ, టీజీటీఏ అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్ పాక, సెక్రటరీ జనరల్ ఫూల్‌సింగ్ హాన్, ఆరేటి రాజేశ్వర్, శ్రీనివాస్ శంకర్, పుష్పమి, ఎస్పీ ఆర్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

